# వాస్తవం

డిజిటల్ పత్రిక

ఉన్నది ఉన్నట్లుగా

డెయిలీ. కామ్

శనివారం 11.07.2026

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి(కె.ఆర్)


ప్రతి నీటి బొట్టు ఒక నిధి

రేపటి తెలంగాణకు

## జల భద్రతే పునాది



వివరాలు 9లో

# శ్రీరాముడు మీద ఆన..

# మళ్లీ మనదే గెలుపు



10

**2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగవు**

**తెలంగాణలో 2029 జూన్‌లోనే అసెంబ్లీ ఎన్నికలు**

**పార్లమెంట్ సీట్లు 26, అసెంబ్లీవి 182కి పెరుగుతాయి**

**182లో 117 సీట్లు గెలిచి రెండోసారి ప్రజాపాలన వస్తుంది**

**కల్వకుంట్ల కౌరవ కుటుంబాన్ని పాతాళానికి తొక్కుతాం**

**రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్**

తెలంగాణలో 2029 జూన్‌లోనే అసెంబ్లీ ఎన్నికలు వస్తాయి. 2029లో జరిగే కురుక్షేత్రంలో మళ్లీ గెలిచేది కాంగ్రెస్సే. పార్లమెంట్ సీట్లు 26, అసెంబ్లీవి 182కి పెరుగుతాయి. 182లో 117 సీట్లు గెలిచి రెండో సారి ప్రజాపాలన వస్తుంది. భద్రాచల రాముడిపై ఆన.. ఇది కాంగ్రెస్ కార్యకర్తల ప్రతిన. కల్వకుంట్ల కౌరవ కుటుంబాన్ని పాతాళానికి తొక్కుతాం. పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌లో బంధించాం. ఆ పాపాల భైరవుడికి ఇకపై విముక్తి లేదు. ఆనాడు వరి వేస్తే.. ఉరి వేసినట్లే అని కేసీఆర్ అన్నారు. కానీ మేం వ్యవసాయం దండగ కాదు.. పండుగ అన్నాం. పేదలకు సన్నబియ్యం, వడ్లకు బోనస్ అందిస్తున్నాం.అన్నదాతల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేశాం. ప్రతి సందర్భంలోనూ వారిని ఆదుకుంటూ వస్తున్నాం.

## కాంగ్రెస్‌లో వివాదాల పరిష్కారానికి పరిశీలకులు

**సురేఖ, కడియం వివాదం పరిష్కారానికి ఏఐసీసీ కార్యదర్శి సావంత్**

**తుంగతుర్తి వివాదం పరిష్కార బాధ్యతలు జగ్గారెడ్డికి అప్పగింత**



**హైదరాబాద్, జూలై 10 :** తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత వివాదాల పరిషారానికి పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీలో గ్రూపు రాజకీయాలు, విభేదాలు మరింత ముదరకుండా ఉండేందుకు గాను ప్రత్యేక పరిశీలకులను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ ఆదేశాలు జారీచేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంత్రి కొండా సురేఖ, సీనియర్ నేత, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య కొంతకాలంగా సాగుతున్న ప్రొటోకాల్, నియోజకవర్గాల వివాదం తాజాగా తీవ్రరూపం దాల్చడంతో వాటిని పరిష్కరించే బాధ్యతను ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్‌కు అప్పగించారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో స్థానిక నియామకాల విషయంలో మందుల సామేల్ వర్గం వర్సెస్ చామల వర్గం మధ్య తలెత్తిన విభేదాలను పరిషరించే బాధ్యతను టీపీసీసీ వరింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికి అప్పగించారు.



7లో..

## జర్మన్ భాష నేర్చుకుంటే రూ.25 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం

జర్మనీలో ఏడాదికి రూ.25 లక్షల ప్యాకేజీతో 5 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, యువత జర్మన్ భాష నేర్చుకుని వీటిని అం దుకోవాలని మంత్రి వివేక్ తెలిపారు.

## హరీశ్ కాంగ్రెస్‌లోకి వస్తానంటే చర్చిస్తాం

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**





**హైదరాబాద్, జులై 10:** మూడు నెలలు నీటిపారుదల మంత్రిగా అవకాశం ఇస్తే నీటి సమస్యను పరిష్కరించి చూపిస్తానంటూ బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. హరీశ్ రావు నిజంగా కాంగ్రెస్‌లోకి వస్తానంటే పార్టీలో చర్చిస్తామన్నారు. పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో చర్చించి హరీశ్‌ను చేర్చుకోవాలా? వద్దా? అని నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పదేండ్లు ఏం చేయని వారు మూడు నెలల సమయంలో ఏం చేస్తారని అన్నారు. గత ప్రభుత్వ అప్పులు, తప్పులను సరి చేస్తున్నామని మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు.కాంగ్రెస్ పార్టీలో అంతర్గత గొడవలపై మహేశ్ స్పందిస్తూ.. కాంగ్రెస్ పార్టీలో భిన్నాభిప్రాయాలు సహజమన్నారు. మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. తుంగతుర్తి సమస్య కూడా పరిష్కారం అవుతుందని చెప్పారు. ఇరు వర్గాల వాదనలు వింటామన్నారు. పార్టీలో అందరూ సమానమే అని తేల్చిచెప్పారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బిజీగా ఉండడం వల్ల ఇద్దరు సీనియర్ నాయకులను సమస్య పరిష్కారం కోసం నియమించామని అన్నారు. సస్పెండ్ చేయడమే పరిష్కారం కాదన్నారు. ప్రభుత్వాన్ని కూలగొడతామని అన్నప్పుడు.. పది మంది ఎమ్మెల్యేలు తమకు మద్దతు ఇచ్చారని చెప్పారు. నీళ్ల దోపిడీ జరిగినప్పుడు ఈటల మంత్రిగా ఉన్నారని మహేశ్ గుర్తుచేశారు.

## తయారీ రంగానికి తెలంగాణ అత్యంత అనుకూలం

**రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా జర్మన్ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి**

**జర్మనీ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో భేటీలో మంత్రి శ్రీధర్ బాబు**



9లో..

తయారీ రంగంలో పరిశ్ర మల ఏర్పాటుకు దేశంలోని ఇతర రాష్ట్రా లతో పోలిస్తే తెలంగాణ అత్యంత అనుకూలమని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే లా జర్మనీ పారిశ్రామికవేత్తలను ప్రోత్స హించాలని ఆ దేశ అత్యున్నత స్థాయి ప్రతినిధి బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరా రు. పెట్టుబడులకు అనుకూలమైన పారిశ్రామిక విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మా నవ వనరులతో ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు.

## జులై 15 నుంచి ఈహెచ్‌ఎస్ హెల్త్ కార్డుల అమలు





**హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్) హెల్త్ కార్డులను జులై 15 నుంచి అమల్లోకి తీసుకురానున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)తో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈహెచ్‌ఎస్ అమలుతో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు పొందే అవకాశం కలగనుంది. ఈ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మరోవైపు ఈహెచ్‌ఎస్ హెల్త్ కార్డులను త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా లాంఛనంగా పంపిణీ చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమానికి సంబంధించిన తేదీని ప్రభుత్వం త్వరలో ప్రకటించనుంది.రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉద్యోగ సం ఘాల ప్రతినిధులు స్వాగతించారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం లభించిందని వారు పేర్కొన్నారు. హెల్త్ కార్డుల అమలుతో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నాణ్యమైన వైద్య సేవలు మరింత సులభంగా అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి

### ఎమ్మెల్యే మందుల సామేలు

**వాస్తవం : అడ్డగూడూరు**

డబుల్ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే మందుల సామేలు ఆదేశించారు. శుక్రవారం చౌళ్ళరామారం గురజాల డబుల్ రోడ్డు పనులను ఆర్ అండ్ బి ఉన్నతాధి కారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రోడ్డు పనులు నిలిచాయని ఆరు నెలల్లో రోడ్డు పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చౌళ్ళరామారం నుండి జానకిపురం వరకు పంచాయతీ రోడ్డును అర్ అండ్ బి శాఖకు మార్చాలని అధికారులను ఆదేశించారు. మానాయికుంట ఎక్స్ రోడ్డు నుండి చిర్రగూడూరు వరకు రోడ్డు పనులు కొనసాగు తున్నాయి.మానాయికుంట ఎక్స్ రోడ్డు నుండి వెల్దెవిఆజీంపేట,మంగమ్మగూడెం వరకు,రేపాక నుండి కంచనపల్లి,సదర్శా పురం వరకు రోడ్లు మంజూరు అయినాయని పేర్కొన్నారు.ప్రభుత్వ కార్యాలయాలు పనులు, ఏటిసి కళాశాల త్వరలోనే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని వర్షాలు లేనందున తక్కువ నెలలో వచ్చే పంటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలపార్టీ అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి,రాష్ట్ర నాయకులు ఇటికాల చిరంజీవి, జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మనగోటి జోజి ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలెంల విద్యాసాగర్,సర్పంచులు రాచకొండ రమేష్, చిత్తులూరు సోమనారాయణ,సీనియర్ నాయకులు పాశంసత్యనారాయణ, వల్లంభట్ల రవిందర్ రావు,బాలెంల సైదులు,పూజారి నర్సయ్య, సమ్మయ్య,సురేష్,కొమురయ్య, రాజశేఖర్ రెడ్డి, కడారి నాగరాజు,పూర్ణచందర్,లక్ష్మణాచారి,ఆర్ అండ్ బి అధికారులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాలకుర్తి రైతు వేదికలో రైతు ఆశీర్వాద సభ ప్రత్యక్ష ప్రసారం

### నిర్వహించిన మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్ కుమార్

**వాస్తవం రామగుండం రూరల్**

పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రైతు వేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు ఆశీర్వాద సభ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వినడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ ఎల్నినో నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ సూచించారు.తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తున్న రైతు భరోసా పథకం ద్వారా కేవలం 9 రోజుల వ్యవధిలో రూ.9,000 కోట్లను రాష్ట్ర రైతుల ఖాతాల్లో జమ చేసిన సందర్భంగారైతు ఆశీర్వాద సభకార్యక్రమాన్ని పాలకుర్తి రైతు వేదిక నుండి ప్రత్యక్ష ప్రసారం ద్వారా నిర్వహించారు.ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా ఖమ్మం జిల్లా చింతకాని మండలం నుండి పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా రైతు భరోసా నిధులు సకాలంలో జమ కావడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి చేస్తున్న కృషిని అభినందించారు.అనంతరం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రం, తాండూరు విడుదల చేసిన తెలంగాణ కంది-3, టి డి ఆర్ జి - 59విత్తనాలను వ్యవసాయ అధికారి చేతుల మీదుగా కొంత మంది రైతులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్,ఏఇఒ ఏం సువర్ణరేఖ అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.



## విద్యా రంగ సమస్యల పరిష్కారానికి ఎఐఎస్ఎఫ్,ఎస్ఎఫ్ఐ డిమాండ్

### శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులు

**వాస్తవం : మద్దూరు**

అఖిల భారత విద్యార్థి సమాఖ్య స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం చేర్యాల,మద్దూరు మండల కేంద్రాలలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా విజయవంతంగా ముగిసింది.విద్యా రంగాన్ని వేధిస్తున్న వివిధ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, విద్యాసంస్థల్లో పారదర్శకత, న్యాయాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ ఈ బంద్‌కు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ..విద్యార్థులు,ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యావ్యవస్థలో నెలకొన్న లోపాలను సరిదిద్దే వరకు తమ పోరాటం ఆగేది లేదని స్పష్టం చేశారు.?ఈ బంద్ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని,శాంతియుత మార్గంలో నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా క్రమశిక్షణతో సాగిన ఈ నిరసన స్థానిక ప్రజల దృష్టిని ఆకర్షించింది.?ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల ముఖ్య నాయకులు యాసీన్, అల్ల హరీష్,సాయి కిరణ్,అభినవ్,ప్రశాంత్,లోకేష్,అరుణ్ తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.బంద్‌ను జయప్రదం చేసి,మద్దతు ప్రకటించిన విద్యార్థులకు,స్థానిక ప్రజలకు,వ్యాపారులకు నాయకులు ధన్యవాదాలు తెలిపారు.



## సర్‌లో ప్రతి ఒక్కరు నమోదు చేసుకోవాలి

**వాస్తవం : మద్నూర్**

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని అంబేద్కర్ కాలనీలోని శుక్రవారం రోజున ఏలీలు సందర్శించి ఎస్ఐ ఆర్ నమోదు నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మాజీ మూడవవాడు సభ్యురాలు లతా సందుల్వార్ కుటుంబ సైతం ఎస్ ఐ ఆర్ నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు ఎస్ఐ ఆర్ నమోదు తప్పకుండా చేసుకొని సంబంధిత అధికారులకు సహకరించాల్సిందిగా ఆమె కోరారు. ఆమెతో జిపిఓ బాబు, చైన్ మాన్ విట్టల్ ఉన్నారు.



### మద్దూరు కేజీబీవీలో

## వంట పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**వాస్తవం : మద్దూరు**



మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం కేజీబీవీలో ఖాళీగా ఉన్న హెడ్ కుక్,అసిస్టెంట్ కుక్ పోస్టుల భర్తీకి అర్హులైన మహిళల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ వరదరాజులు ఒక ప్రకటలో తెలిపారు.హెడ్ కుక్‌కు 10వ తరగతి,అసిస్టెంట్ కుక్‌కు 7వ తరగతి పాస్అయి ఉండాలి.వయస్సు 25 నుండి 55 ఏళ్ల మధ్య ఉండాలి నెల జీతం రూ.9,750,ఆసక్తి గల వారు తమ ఆధార్,విద్యా అర్హ త సర్టిఫికెట్లు,ఫోటోలతో ఈ నెల 14న సాయంత్రం 5 గం టల లోపు మద్దూరు కేజీబీవీ ఆఫీసులో దరఖాస్తు చేసుకో వాలని తెలిపారు.మద్దూరు,చేర్యాలలో విద్యార్థి సంఘాల బంద్ విజయవంతం

## కంది పంటలో సమూహ క్షేత్ర ప్రదర్శన



**వాస్తవం : మద్నూర్**

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం మేనూరు గ్రామ రైతు వేదికలో ఈరోజు కంది పంటలో సమూహ క్షేత్ర ప్రదర్శన భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూరు మరియు వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో 125 మంది రైతులకు కంది పంటలో అధిక దిగుబడుల కోసం ఈ97 విత్తనాలు ఇచ్చారు. కందిలో రైసోబియం, ఎరువుల యాజమాన్యం, సస్య రక్షణ చర్యలు వంటి మేలైన మేలుకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు.ఇం దులో కృష్ణ విజ్ఞాన కేంద్రం రుద్రూరు సీనియర్ సైంటిస్ట్ , హెడ్ డాక్టర్ కె. ఇందుధర్ రెడ్డి,మండల వ్యవసాయ శాఖ అధికారి వి.రాజు,విస్తరణాధికారి విశాల్,గ్రామ సర్పం చ్ అశోక్ పటేల్ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

### చేనేత సహకార సంఘం సభ్యుల

## ప్రమాణ స్వీకారం



**వాస్తవం : అందోల్**

అందోల్ జోగిపేట మున్సిపల్ పట్టణం లోని చేనేతసహకార సంఘం సభ్యుల ప్రమాణ స్వీకారం ఆ సంఘంలో ఎన్నికల అధికారి విరజిత్ అలీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ సభ్యులు సంఘంలో కలియ తిరిగారు ఊక్కడ మగ్గం నేయడానికి వీలు లేకుండా ఉండడం రోజువారీ వచ్చే లేబర్ కు పనులు లేకుండా పోవడంతోడబ్బులు అందుబాటులో లేకపోవడంతో స్పందించినమాజీ చైర్మన్ పడిగెల అభినవ్ సహకారంతో లక్ష రూపాయలు తీసుకొని మగ్గం పనులు ప్రారంభించారు. అలాగే ప్రస్తుత చైర్మన్ పడిగేల సత్యం 50 వేల రూపాయలు అందజేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సత్యం,ఉపాధ్యక్షులుఅనంత రాజ్, కోశాధికారి తాటికొండ వెంకటేశం,డైరెక్టర్లు,కుమారస్వామి కిష్టయ్య, మెట్టు రమేష్,చిట్యాల మధు,ఇందిరా,లక్ష్మీ, చేనేత సహకార సంఘంసభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా రక్షణే ప్రధాన బాధ్యత

**వీర్నపల్లి ఎస్సై వేముల లక్ష్మణ్**

**స్టేషన్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.**

**వాస్తవం : వీర్నపల్లి**



ప్రజల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ, పోలీస్ స్టేషన్ల పనితీరు,నేరాల దర్యాప్తు పురోగతి,ప్రజలకు అందిస్తున్న సేవలను నిరంతరం పర్యవేక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే శుక్రవారం రోజున వీర్నపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈసందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు,పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి,స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, పెట్రోలింగ్ నిర్వహణ, రౌడీషీటర్లు,పాత నేరస్తులపై నిఘా తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించి, ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలపై ప్రత్యేకంగా ఆరా తీశారు.ప్రజా భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అధికారులకు సూచించారు.ప్రజల్లో భద్రతాభావాన్ని మరింత పెంపొందించేలా విజిబుల్ పోలీసింగ్‌ను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు.ఆస్తి నేరాలు,చోరీలు,గంజాయి అక్రమ రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగిస్తూ, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని సూచించారు.గ్రామాలను తరచూ సందర్శిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా సేవలు అందించాలని , విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి,సి.ఐ వెంకటేష్,ఎస్.ఐ లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్, జోనల్ స్థాయి డ్యూటీ మీట్

**రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసుల ఉత్తమ ప్రతిభ**

**క్రీడాకారులను,పోలీస్ అధికారులను,సిబ్బందిని**

**అభినందించిన జిల్లా ఎస్పీ మహేష్ బి గితే**

**వాస్తవం : సిరిసిల్ల**



మల్కాజిగిరి కమిషనరేట్ వేదికగా ఈనెల7 నుండి 9 వరకు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర 5 వ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో జిల్లా పోలీసు క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచి మొత్తం 3 పతకాలు ( యోగ లో రిజర్వ్ కానిస్టేబుల్ దేవరాజ్ గోల్డ్ మెడల్, ఆర్చ్ రెజిలింగ్ ఆర్ఎస్ఐ శ్రీనివాస్ బ్రాంజ్ మెడల్, పవార్ లిఫ్టింగ్‌లో ఆర్మ్‌డ్ కానిస్టేబుల్ సంతోష్ సిల్వర్‌సాధించడం పట్ల జిల్లా ఎస్పీ మహేష్ బి సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా కరీంనగర్ వేదిక జరిగిన జోనల్ స్థాయి డ్యూటీ మీట్‌లో వివిధ క్యాటగిరీలలో ప్రతిభ కనబర్చిన పోలీస్ అధికారులు,సిబ్బందిని,సిరిసిల్ల రూరల్ సిఐ నాగేశ్వరరావు,బోయినపల్లి ఎస్ఐ రమాకాంత్, వీర్నపల్లి ఎస్ఐ లక్ష్మణ్, కానిస్టేబుళ్ల శేఖర్,హరీష్,కిరణ్‌లను అభినందించారు.ఈసందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విజేతలకు పతకాలు అందజేసి అధికారులను,సిబ్బందిని ప్రత్యేకంగాఅభినందించారు.క్రీడలు మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా ఎస్పీ తెలిపారు. గెలుపోటములు సహజమని,విజేతలు జాతీయ స్థాయిలో మెరుగైన ప్రదర్శన ఇవ్వడానికి కృషి చేయాలన్నారు.ఓటమి చెందిన వారు నిరాశ చెందకుండా తమలోపాలను సరిదిద్దుకొని ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల రూరల్ సిఐ నాగేశ్వరరావు, ఆర్ఐ అడ్మిన్ సురేష్, ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా కేకే జన్మదిన వేడుకలు

**వాస్తవం : గంభీరావుపేట**



కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను గంభీరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పర్స హన్మాండ్లు మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు హమీద్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, పుట్టినరోజు కేకును కాంగ్రెస్ శ్రేణుల సమక్షంలో కట్ చేసి టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా పర్స హన్మాండ్లు,హమీద్‌లుమాట్లాడుతూ..అసలు సిసలైన తెలంగాణ వాది ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తూ సాదాసీదా జీవితం గడిపే వ్యక్తి కేకే మహేందర్ రెడ్డిఅన్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినా ప్రజల పక్షాన ఉన్నారని కాంగ్రెస్ పార్టీ అధికారం వచ్చిన తర్వాత కూడా నిజాయితీగా ఉన్న వ్యక్తి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు రాకముందే ఉద్యమ కారుడిగా తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేశాడని,వామపక్ష భావజాలం కలిగి అట్టడుగు ప్రజలకు సేవ చేసిన చరిత్ర మహేందర్ రెడ్డి కే దక్కుతున్నదన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డాక సిరిసిల్ల నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అట్టడుగు ప్రజలకు అందే విధంగా కృషి చేస్తున్న వ్యక్తి మహేందర్ రెడ్డి అన్నారు.మహేందర్ రెడ్డి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటున్నామని పర్స హన్మాండ్లు హమీదులు పేర్కొన్నారు.నాయకులు గంగి స్వామి రాజనర్సింహారెడ్డి,చేకూరి మహేష్,బలరాం రెడ్డి,అంజాగౌడ్,ఎలుక రాజు,నర్సింలు, శెట్టి రవి,అంజిరెడ్డి,రాఘవేందర్ రెడ్డి,పోచయ్య,నాంపల్లి, శ్రీనివాస్,లక్ష్మణ్,శంకర్,అజం,లక్ష్మణరావు,భగవంతు రావు, భాస్కర్,భాస్కర్ నాయక్,రాజయ్య,వెంకటి,బాల్ రెడ్డి,అన్నీ గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

**టియుడబ్ల్యూ జె జిల్లా ఆర్గనైజేషన్**

# జాయింట్ సెక్రటరీగా బోడ సుమన్

**వాస్తవం : అందోల్**



తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యూ జె--ఐజెయూ) సంగారెడ్డి జిల్లా ఆర్గనైజేషన్ జాయింట్ సెక్రటరీగా జోగిపేటకు చెందిన 6టీవీ రిపోర్టర్ బోడ సుమన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ నెల 9న సంగారెడ్డిలో నిర్వ హించిన (టియుడబ్ల్యూ--ఐజెయూ) జిల్లా మహాసభలో జరి గిన జిల్లా కమిటీ ఎన్నికల్లో ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు.ఈ సందర్భంగా బోడ సుమన్ మాట్లాడుతూ..తన పై విశ్వాసం ఉంచి పదవి అప్పగించిన జిల్లా జర్నలిస్టులు, సంఘ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం,సంఘ బలోపేతం,సభ్యుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని చెప్పారు. ప్ర తి జర్నలిస్టుకు అందుబాటులో ఉంటూ సంఘ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ,నాయకుడు ఫైసల్ అహ్మద్,జిల్లా అధ్యక్షుడు యాదగిరి,జాతీయ కార్యవర్గ మాజీ సభ్యుడు వెంకటరెడ్డితో పాటు జిల్లా జర్నలిస్టులందరికి ఆ యన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు బోడ సుమన్‌ను అభినందించారు.

**వైద్య విధాన పరిషత్తులో**

# రెగ్యులర్ కమిషనర్ను ఏర్పాటు చేయాలి



**వాస్తవం : ఆందోల్**

తెలంగాణ వైద్య విధాన పరిషత్ లో రెగ్యులర్ కమిషనర్ను వెంటనే అపాయింట్ చేయాలని జోగిపేట ఏరియా ఆసుపత్రి లో శాంతియుత నిరసన చేశారు.ఈ నిరసన లో డాక్టర్ల బృందం వైద్య సిబ్బంది పాల్గొనారు ఈ సందర్భంగావారు మాట్లాడుతూ రీడిప్లాయిమెంట్, ప్రమోషన్స్ ,సర్వీస్ రెగ్యులరైజేషన్ ,పెండింగ్ బిల్స్,ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల కొనసాగింపు,సర్వీస్ రిజిస్టర్ల రిటర్న్ చేయడం లాంటి వివిధ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు.జోగిపేట ఏరియా హాస్పిటల్ డాక్టర్స్ హాస్పిటల్ సిబ్బంది శాంతియుత నిరసన లో పాల్గొన్నారు.

# ఆశిరెడ్డిపల్లిలో వన మహోత్సవం



**వాస్తవం : చందుర్తి**

చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు.గ్రామపంచాయతీ సర్పంచ్ బొజ్జమ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.గ్రామ శివారు నల్లగుట్ట ప్రాంతంలో మాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలు మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నగేష్,ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ నేదూరి మధు,మాజీ సర్పంచ్ బొజ్జ లింగయ్య, తదితరులు, కూలీలు పాల్గొన్నారు.

జన్మదినోత్సవాలు,
పదవీ విరమణ
శుభాకాంక్షల
ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190



# హుస్నాబాద్ అభివృద్ధికి భారీ ఊతం

**విద్యా, ఉద్యోగ,ఉపాధి కల్పనల దిశగా పొన్నం అడుగులు**

**ఆయిల్ ఫామ్ సాగు పెంచే గ్రామ పంచాయతీలకు ప్రోత్సాహకాలు**

**టామ్ కాం ద్వారా విదేశాల్లో లక్షల జీతాలతో ఉద్యోగాలు**

**నైపుణ్యాలు సాధించి యువత ఉద్యోగాలు సాధించాలి**

**ఏటీసీ లతో యువతకు ఉజ్వల భవిష్యత్,**

**రూ.45.15 కోట్లతో హుస్నాబాద్ లో ఏటీసీకి భూమిపూజ**

**హుస్నాబాద్‌ను తెలంగాణలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం - మంత్రులు పొన్నం ప్రభాకర్,వివేక్ వెంకట స్వామి**

**వాస్తవం : హుస్నాబాద్**








శాసనసభ్యునిగా ఒకవైపు నియోజకవర్గంను అభివృద్ధి పథం వైపు నడిపిస్తూ విద్యా,ఉద్యోగ,ఉపాధి కల్పనల దిశగా మంత్రి పొన్నం ప్రభాకర్ తన మార్క్ ను చూపిస్తున్నారు.ఇందులో భాగంగానే సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,రాష్ట్ర కార్మిక,ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి పాల్గొన్నారు. జనగామ గ్రామంలో మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమం,తోటపల్లి గ్రామంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ ) నిర్మాణానికి భూమిపూజ,టామ్‌కాం ఆధ్వర్యంలో మెగా విదేశీ ఉద్యోగ మేళా,ఉమ్మాపూర్‌లో శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల భవనాల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... హుస్నాబాద్ ప్రాంత రైతుల ఆదాయం పెంచేందుకు ఆయిల్ పామ్ సాగును విస్తృతంగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 50 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే రూ.14 వేల ఎకరాలకు పైగా సాగు జరుగుతోందన్నారు. 5 ఎకరాలకు పైగా భూమి ఉన్న రైతులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నందున రైతులు ఆయిల్ పామ్ వంటి దీర్ఘకాలిక, లాభదాయక పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ఎకరాకు రూ.50 వేల వరకు సబ్సిడీ అందిస్తోందని, నాలుగు సంవత్సరాల వరకు అంతర పంటలు సాగు చేసుకునే అవకాశం కూడా ఉందన్నారు. నర్మేటలో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ అందుబాటులో ఉండటంతో రైతులకు మార్కెటింగ్ సమస్య ఉండదని వివరించారు. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించే గ్రామాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని మంత్రి ప్రకటించారు.చిన్న గ్రామాల్లో 100 ఎకరాలకు పైగా, పెద్ద గ్రామాల్లో 200 ఎకరాలకు పైగా ఆయిల్ పామ్ సాగు జరిగితే వరుసగా రూ.5 లక్షలు, రూ.10 లక్షల అభివృద్ధి ప్రోత్సాహక నిధులు అందజేస్తామని తెలిపారు.

**అడ్వాన్స్డ్ టెక్నాలజీ చారిత్రక ఘట్టం**

హుస్నాబాద్‌లో రూ.45.15 కోట్ల వ్యయంతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణం ప్రారంభించడం చారిత్రాత్మక ఘట్టమని మంత్రి పేర్కొన్నారు. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్న ఈ కేంద్రం ద్వారా యువతకు రోబోటిక్స్, 3డీ ప్రింటింగ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, ఎలక్ట్రిక్ వెహికల్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), ప్రొడక్ట్ డిజైన్ వంటి అత్యాధునిక సాంకేతిక రంగాల్లో శిక్షణ అందుతుందని తెలిపారు. ఒక్కో శిక్షణార్థికి నెలకు రూ.2 వేల స్టైపెండ్ కూడా ప్రభుత్వం అందిస్తోందన్నారు. హుస్నాబాద్‌ను వెనుకబడిన ప్రాంతంగా కాకుండా విద్య, వైద్యం, పర్యాటకం, పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. 250 పడకల ఆసుపత్రి, పీజీ మెడికల్ కాలేజీ, నాలుగు లైన్ల రహదారి, అర్బన్ ఫారెస్ట్ పార్క్, ఎల్లమ్మ చెరువు పర్యాటక అభివృద్ధి, ఇండస్ట్రియల్ పార్క్ వంటి అనేక ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు.

**టామ్ కామ్ తో నిరుద్యోగ యువతకు భరోసా**

టామ్‌కాం ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా విదేశీ ఉద్యోగ మేళాకు సుమారు 1,500 మంది నిరుద్యోగ యువత నమోదు చేసుకోవడం సంతోషకరమని మంత్రి అన్నారు.ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తూ,స్థానిక యువత ప్రపంచ స్థాయి ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జర్మనీ సహా పలు దేశాల్లో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, హుస్నాబాద్‌లో జర్మన్ భాషా శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. జర్మన్ భాష నేర్చుకునే యువతకు వ్యక్తిగతంగా నెలకు రూ.1,000 స్టైపెండ్ అందించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.వ్యవసాయ పనిముట్ల తయారీ, ఎంఎస్ఎంఈ రంగాల్లో కూడా ప్రత్యేక నైపుణ్య శిక్షణ అందించి యువతను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహిస్తామని మంత్రి తెలిపారు.హుస్నాబాద్‌లో డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు చేయాలని కూడా ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు.

**ఇంజనీరింగ్ కళాశాలకు భూమి పూజ చేయడం ఆనందదాయకం**

ఉమ్మాపూర్‌లో శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల శాశ్వత భవనాల నిర్మాణానికి భూమిపూజ చేయడం ఆనందదాయకమని మంత్రి అన్నారు.ఏడాది వ్యవధిలో నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల హాస్టల్ నిర్మాణానికి రూ.15 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయని, త్వరలోనే శంకుస్థాపన నిర్వహిస్తామని తెలిపారు.ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హుస్నాబాద్ ప్రాంతానికి ఇంజనీరింగ్ కళాశాల,లా కళాశాల,ఫార్మసీ కళాశాల వంటి విద్యాసంస్థలు మంజూరు చేశామని, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, సైకిళ్లు వంటి సౌకర్యాలు కల్పిస్తూ నాణ్యమైన ఉన్నత విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు.గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల నిర్మాణానికి ప్రభుత్వం రూ.220 కోట్లు కేటాయించిందని,రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులు, యువత, విద్యార్థుల భవిష్యత్తును బలోపేతం చేసే దిశగా అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం చేస్తామని మంత్రి తెలిపారు.మంత్రి వివేక్ వెంకట్ స్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొంటూ, టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో రూ.4 వేల కోట్లకు పైగా వ్యయంతో 119 అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో రోబోటిక్స్, 3డీ ప్రింటింగ్, ఈవీ మెయింటెనెన్స్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, డిజిటల్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ వంటి ఆధునిక కోర్సుల్లో శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏటీసీ లలో శిక్షణ పొందే ప్రతి విద్యార్థికి నెలకు రూ.2 వేల స్టైపెండ్ అందిస్తున్నామని తెలిపారు. అలాగే జర్మన్ భాష నేర్చుకునే యువతకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పిస్తూ విదేశీ ఉపాధికి సిద్ధం చేస్తున్నామని చెప్పారు.టామ్ కాం ద్వారా రాష్ట్ర యువతకు దేశ, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని, ఇందుకోసం ప్రభుత్వం రూ.90 కోట్ల బడ్జెట్ కేటాయించిందని తెలిపారు. విదేశాల్లో లక్షల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, యువత నైపుణ్యాలు, భాషా పరిజ్ఞానం పెంపొందించుకుని ఆ అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత లక్షకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసి సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందన్నారు.హుస్నాబాద్‌లో శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు కావడం ఈ ప్రాంత విద్యార్థులకు గొప్ప అవకాశమని పేర్కొన్నారు. కళాశాల హాస్టల్ నిర్మాణం, ఆధునిక వసతుల కల్పనతో పాటు విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హుస్నాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని, ఇక్కడి నుంచి శిక్షణ పొందిన యువత ప్రపంచవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు సాధించాలని మంత్రి వివేక్ వెంకట్ స్వామి ఆకాంక్షించారు.

# చైన్ స్నాచర్ ను అరెస్టు చేసిన పోలీసులు




**వాస్తవం : రాజేంద్రనగర్**

చైన్ స్నాచర్ ను అరెస్టు చేసి నాలుగు గోల్డ్ చైన్లను స్వాధీనం చేసుకున్న అత్తాపూర్ పోలీసులు. సీఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.మల్లేపల్లి కి చెందిన ఏవన్‌గా ఉన్న నిందితుడు హతకడె విశాల్ (25)కు పరారీలో ఉన్న మిగతా నిందితులు రవి,జహంగీర్,శ్యాంసుందర్ కు జైలు లో పరిచయాలు ఏర్పడ్డాయి.ఈ నిందితులపై ఇంతకుముందే నేరాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. వ్యసనాలకు, చెడు అలవాట్లకు బానిసలై నేరాలకు పాల్పడుతున్నారు. ఈజీ మనీ కోసం చైన్ స్నాచింగ్ కు ప్లాన్ వేసి అదును కోసం బస్టాప్ ల వద్ద బస్సు ప్రయాణికులపై నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో గత సంవత్సరం అక్టోబర్ 16న గండిపేటకు చెందిన గాజుల సతీష్ అనే వ్యక్తి తన సొంత పనిపై అత్తాపూర్ నుండి అరాంఘర్ కు బస్సులో వెళ్తున్నాడు. అరాంఘర్ చౌరస్తా వద్దకు బస్సు రాగానే అతను ఫుట్ బోర్డ్ పై నిల్చున్నప్పుడు మాటలలో పెట్టి నిందితులు బాధితుని దృష్టి మరల్చారు. అదును చూసుకొని ప్రధాన నిందితుడు విశాల్ చైన్ ను దొంగలించాడు. ఎవరికి అనుమానం రాకుండా అక్కడినుండి పరారయ్యారు. తరువాత విషయం తెలుసుకున్న బాధితుడు అత్తాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ప్రధాన నిందితుడు విశాల్ ను అరెస్టు చేయగా మిగతా నిందితులు పరారీలో ఉన్నారు.చైన్ స్నాచింగ్‌లో నమోదైన నాలుగు కేసులలో మొత్తం 29.7 గ్రాముల బరువుతో ఉన్న నాలుగు బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

# ఆపరేషన్ ముస్కాన్ విజయవంతానికి సమన్వయంతో పనిచేయాలి

**జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య**

**వాస్తవం : సిరిసిల్ల**

ఆపరేషన్ ముస్కాన్ విజయవంతానికి అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా అదనపు ఎస్పి చంద్రయ్య పిలుపునిచ్చారు.గడిచిన 10 రోజుల్లో జిల్లాలో 37 మంది పిల్లలను రెస్క్యూ చేసి సిడబ్ల్యూసి ముందు హాజరుపరచగా తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి అప్పగించడం జరిగిందని,18 సంవత్సరాలలోపు పిల్లలను పనిలో పెట్టుకుని వారితో పని చేయిస్తున్న వారిపై 13 కేసులు నమోదైనట్లు తెలిపారు.జిల్లా ఎస్పీ మహేష్ బి గితే ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యలయంలో శుక్రవారం అపరేషన్ ముస్కాన్ టీమ్ లో ఉన్న అన్ని శాఖల అధికారులతో అదనపు ఎస్పీ చంద్రయ్య సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ..ఆపరేషన్ ముస్కాన్ లో భాగంగా జిల్లాలోని పరిశ్రమలు, హోటళ్ళు, వ్యాపార సముదాయాలు, గోదాములు, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీలు తదితర ప్రాంతాల్లో వ్యూహాత్మకంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, బాల కార్మికులు లేదా తప్పిపోయిన బాలలను గుర్తించి, వారికి తగిన రక్షణ కల్పించి వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకుల వద్దకు చేర్చే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం కోసం పోలీసు శాఖతో పాటు సంబంధిత అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పకడ్బందీగా పనిచేయాలని, ప్రతి తనిఖీని ప్రణాళికాబద్ధంగా నిర్వహించి బాలల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.ఈసంవత్సరం జులై 1 నుండి 31 వరకు పోలీస్ శాఖ,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ,లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్,వివిధ డిపార్ట్మెంటు అధికారులతో జిల్లాలో టీమ్‌లుగా ఏర్పాటు చేసి ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలను గుర్తించి విస్తృతంగా తనిఖీలు



నిర్వహించి జిల్లా వ్యాప్తంగా గడిచిన 10 రోజులలో 37 మంది పిల్లలని గుర్తించి వారి యొక్క తల్లిదండ్రుల వద్దకు చేర్చడం జరిగిందని,18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుని వారితో పని చేయిస్తున్న వారిపై 13 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు.ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం,ఎస్ఐలు ప్రేమనందం,లకుపతి,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టాలి

**భావి తరాలకు నీటిని కాపాడాలి కలెక్టర్ రాహుల్ శర్మ**

**వాస్తవం : భూపాలపల్లి**

జల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని,ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగిస్తూ భావి తరాలకు నీటి కొరత రాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలశక్తి అభియాన్--3.0లో భాగంగా ఈ నెల 6వ తేదీ నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు నిర్వహిస్తున్న “క్యాచ్ ది రెయిన్” నెల రోజుల ఇంటెన్సివ్ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయడంపై శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జాతీయ జల మిషన్ జల ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జలశక్తి అభియాన్ పురోగతిని ప్రధానమంత్రి కార్యాలయం ప్రతిరోజూ పర్యవేక్షిస్తోందని తెలిపారు. అందువల్ల అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో నీటి సంరక్షణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాలు,విద్యాసంస్థలు,మున్సిపాలిటీలు,గ్రామ పంచాయతీల్లో ప్రజలతో జల ప్రతిజ్ఞ చేయించి నీటి సంరక్షణపై చైతన్యం కల్పించాలని సూచించారు.జాతీయ జల మిషన్ రూపొందించిన జల ప్రతిజ్ఞ లక్ష్యాలను వివరిస్తూ, ప్రతి ఒక్కరూ నీటిని అమూల్యమైన సహజ వనరుగా భావించి పొదుపుగా వినియోగించాలని పిలుపునిచ్చారు. కురిసే ప్రతి వర్షపు చుక్కను



సద్వినియోగం చేసుకునేందుకు ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్లు, పంట గుంతలు వంటి వర్షపు నీటి నిల్వ నిర్మాణాలను చేపట్టాలని,వాటి వివరాలను తప్పనిసరిగా జేఎస్ జేబీ3.0 పోర్టల్లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కుటుంబ సభ్యులు,స్నేహితులు,పొరుగువారిలో కూడా నీటి సంరక్షణపై అవగాహన పెంపొందించి,నీటి వృథాను నివారించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. జాతీయ జల మిషన్ లక్ష్యాల సాధనకు జల సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపల్, గ్రామీణ ప్రాంతాల్లో బ్యానర్లు, వాల్ పెయింటింగ్స్‌తో పాటు మీడియా ద్వారా కూడా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు.అనంతరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు,సిబ్బందితో కలిసి జల ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీవో హరికృష్ణ,మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విలీనం హామీని మరిచిన మంత్రి

## బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి మల్లికార్జున్ రెడ్డి



**వాస్తవం : హుస్నాబాద్**

ఉమ్మడి హుస్నాబాద్ మండలంలో ఉన్న గౌరవెల్లి జనగామ రేగొండ గోవర్ధనగిరి లాంటి గ్రామాలను ఆనాటి ప్రజాప్రతినిధుల ఒత్తిడికి తలొగ్గి అక్కన్నపేట మండలంలో కలిపి ప్రజల ఇబ్బందులకు గురి చేశారని బీఆర్ఎస్ నాయకుడు మల్లికార్జున్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం అక్కన్నపేట మండలంలోని మల్చెరువు తండాలో మాట్లాడారు. 2024 శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన పొన్నం ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కొన్ని రెవెన్యూ గ్రామాలను హుస్నాబాద్ లో విలీనం చేస్తామనే మాటను మర్చిపోయారని గుర్తు చేశారు. మండలానికి దూరంగా ఉన్న గ్రామాలలో ని ప్రజలు మండలానికి వెళ్లాలంటే సరైన బస్సు సౌకర్యం లేదని ఆరోపించారు.ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వెళ్లాల్సి వస్తుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీని ఇట్లా మర్చిపోతేఎలా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో బీఆర్ఎస్ పక్షాన పోరాటం చేస్తామన్నారు.

# అధికార ప్రజా ప్రతినిధుల మెప్పుకోసం కమీషనర్ సొంత నిర్ణయాలు

**రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో పైలట్ ఏజెన్సీ విధానాన్ని రద్దు చేయాలి**

**అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్లే కార్డులతో నిరసన తెలిపిన చెత్త సేకరణ కార్మికులు**

**వాస్తవం : గోదావరిఖని**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో పైలట్ ఏజెన్సీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటియుసి రామగుండం యూనిట్ ఆధ్వర్యంలో మున్సిపల్ జంక్షన్ వద్ద ప్లే కార్డులతో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు ఈ నిరసనలో ఏఐటియుసి నాయకులు మద్దెల దినేష్, ఎంఎ గౌస్ పాల్గొని మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా ఇంటింటి చెత్త సేకరణ చేస్తున్న కార్మికుల ఉపాధికి భంగం కలిగించే విధంగా కార్పొరేషన్ కమిషనర్ ఏకపక్షంగా కార్మిక వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు అధికార పక్షానికి వత్తాసు పలుకుతూ 7 డివిజన్లలో కొత్తగా పైలట్ ఏజెన్సీ విధానాన్ని అమలు చేయాలని చూస్తున్నారని, దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఏఐటియుసి అంగీకరించదని వారు స్పష్టం చేశారు.పైలట్ ఏజెన్సీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి.గత 26 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఇంటింటి చెత్త సేకరణ కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి.చెత్త సేకరణ కార్మికులుగా కాకుండా ఔట్ సోర్సింగ్ వర్కర్స్ గా గుర్తించి నెలకు 26 వేల వేతనం చెల్లించాలి.పైలట్ ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసేంతవరకు పోరాటాలు,ఉద్యమాలు కొనసాగిస్తామని కమిషనర్ మరియు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల కార్మిక వ్యతిరేక చర్యలను ప్రజల ముందు ఎండ గడతామని హెచ్చరించారు.ఇప్పటికైనా కార్పొరేషన్ కమిషనర్ మరియు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు స్పందించి కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు లేనిచో ఏఐటియుసి ఆధ్వర్యంలో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు ఈ నిరసన కార్యక్రమంలో చెత్త సేకరణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల

ప్రకటనల కోసం సంప్రదించండి

8074124190



# ఈ నెల 24 లోగా ఎన్యుమరేషన్ ఫారాలను బిఎల్ఓలకు ఇవ్వాలి

## రాజేంద్రనగర్ ఈఆర్ఓ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

**వాస్తవం : రాజేంద్రనగర్**




రాజేంద్రనగర్ నియోజకవర్గం ఓటర్లందరు ఈ నెల 24వ తేదీ లోగా బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ ఓ)లు ఇచ్చిన ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి ఇవ్వాలని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కోరారు. బీఎల్ ఓలకు పాస్ పోర్ట్ సైజు ఫోటో పెట్టి ఇవ్వాలని, అలా ఇచ్చిన వారి పేర్లు మాత్రమే జూలై 31న విడుదల చేసే ఓటరు జాబితా డ్రాఫ్ట్ లో ఉంటాయని తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... శుక్రవారం భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) నిర్వహించిన సమీక్షా సమావేశంలో అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా ఎన్యుమరేషన్ ఫారాలను (ఈఎఫ్) డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించడం జరిగిందన్నారు. జూలై 24 లోగా ఓటర్లనుంచి వచ్చిన ఎన్యుమరేషన్ ఫారాలన్నింటిని అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు.ఎన్యుమరేషన్ ఫారాలను తీసుకుని మెల్లిగా పూర్తి చేసి ఇస్తామంటే ఓటరు పేరు త్వరలో వచ్చే డ్రాఫ్ట్ లో ఉండదన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఒక ఈఆర్ఓ, ఏడుగురు ఏఈఆర్ లు, 55 మంది వరకు సూపర్వైజర్లు, 547 మంది బీఎల్ఓ లు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి తిరిగి తీసుకునే పనిలో ఉన్నారన్నారు. రాజకీయ పార్టీల నుంచి నియమితులైన బీఎల్ఏ లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువజన సంఘాలు ఓటర్లను చైతన్యం చేయాలని కోరారు. సకాలంలో ఎన్యుమరేషన్ ఫారాలను అందజేసే విధంగా చూడాలన్నారు. ఇప్పుడు ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి ఇవ్వకపోతే ఆగస్టులో అన్ని ధృవీకరణ పత్రాలు పెట్టి ఫారం 6 సమర్పించాల్సిఉంటుందని వెల్లడించారు.అలా చేసిన వారి పేరు అక్టోబరులో వచ్చే తుది ఓటరు జాబితా లో పొందుపరచడం జరుగుతుందన్నారు. అలా కాకుండ ఈ నెల 24లోగా ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తే బాగుంటుందని తెలిపారు.

### బోనాల పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన

# పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**బోనాల ఉత్సవాల నిధుల కోసం జూలై 15లోగా దరఖాస్తు చేసుకోవాలి**



**వాస్తవం : శేరిలింగంపల్లి, జూలై 10 :** తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన ఆషాఢ బోనాల పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు పిఏసి చైర్మన్ ఆరెక పూడి గాంధీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతా వరణంలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ. బోనాల ఉత్సవాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని అర్హత (రిజి స్ట్రేషన్) కలిగిన ఆలయ కమిటీలు ఉత్సవాల నిధుల కోసం జూలై 15వ తేదీలోగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖా స్తుతో పాటు టెంపుల్ కమిటీ లెటర్ప్యాడ్, ఆలయ బ్యాంక్ ఖాతా వివరాలు, కమిటీ అధ్యక్షుడు, ప్రధాన కార్య దర్శి ఆధార్ ప్రతులు, ఆలయానికి సంబంధించిన అమ్మవారి ఫొటోలు జతచేయాలని, ప్రతి పత్రంపై కమిటీ స్టాంపు తప్పనిసరిగా ఉండాలని తెలి పారు. రాష్ట్ర ప్రభుత్వం బో నాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పి స్తోందని, భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవాల్లో పాల్గొనేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు.

# జన్ను శ్యామ్ ను సత్కరించిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు

-ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న 25వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు

-యువ నాయకుడి కృషిని గుర్తించిన రాష్ట్ర నేతలు



**వాస్తవం : వరంగల్ ప్రతినిధి: జూలై 10**

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్తున్న 25వ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జన్ను శ్యామ్ కృషిని రాష్ట్ర నాయకులు ప్రశంసించారు. పార్టీ కార్యక్రమాలలో ప్రజలతో నేరుగా మమేకమై, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంలో జన్ను శ్యామ్ చూపిస్తున్న చురుకుదనాన్ని గుర్తించిన రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజ్, వరంగల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ మీసాల ప్రకాష్‌లు శుక్రవారం జన్ను శ్యామ్ ను మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు వద్దకు ప్రత్యేకంగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జన్ను శ్యామ్ కొండా మురళీధర్ రావు కు శాలువా కప్పి సన్మానించారు. స్పందించిన కొండా మురళీధర్ రావు మాట్లాడుతూ.. జన్ను శ్యామ్ యువ నాయకుడిగా పార్టీకి మంచి పేరు తీసుకొస్తున్నారని, ఇదే స్ఫూర్తితో ముందు కూడా పనిచేయాలని ఆకాంక్షించారు. అనంతరం కొండా మురళీధర్ రావు కూడా జన్ను శ్యామ్ కు శాలువా కప్పి అభినందించారు.అనంతరం జన్ను శ్యామ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని, పార్టీ ఆదేశాల మేరకు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సందెల లాజర్‌తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిఎల్‌వోలు సహకరించాలి

**వాస్తవం : జూబ్లీహిల్స్**

తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరంలో గత నెల (జూన్ 2026)25వ తారీఖున ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారులు ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమాన్ని బూత్ లెవెల్ ఆఫీసర్లతో సమన్వయం చేసుకొని బూత్ లెవల్ ఏజెంట్లు పగడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు సర్ కార్యక్రమంలో పాల్గొంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.అంతా బాగానే ఉంది కానీ చిక్కంతా బి .ఎల్ .ఓ.ల నుంచి వస్తుంది అని చర్చించుకుంటున్నారు.ఈ విషయం తెలుసుకున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గం వాస్తవం రిపోర్టర్ కొంతమంది బి ఎల్ వో ల సంప్రదిస్తే వారు కోరేది ఏమిటంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని వివిధ డివిజన్ లలో బి. ఎల్. వో. లు సర్ కార్యక్రమం మొదలైనప్పటి నుంచి వారి (బి ఎల్ ఓ) దగ్గర నుంచి స్పందన తక్కువ ఉందని, వారికి ఫోన్లు చేసిన రాలేదని, వచ్చిన తొందరగా వెళ్ళిపోతున్నారని ఈ విధంగా చేస్తే ప్రజలకు బి ఎల్ .ఎ లు అయిన మేము దరఖాస్తు ఫారాలను అందించే పరిస్థితి తక్కువగా ఉంటుందని అన్నారు. ప్రస్తుతం సమయం 14 రోజుల గడువే ఉందని (ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు జూలై 24 (2026)వరకు చివరి తేదీ అని) అన్నారు. చివరగా బి .ఎల్.ఎ .లు కోరేది ఏమిటంటే బి. ఎల్ .ఓ. (బూత్ లెవల్ ఆఫీసర్లు) సక్రమంగా మాకు సహకరించాలని, దానిద్వారా ప్రజలకు దరఖాస్తు ఫారాలు సమయంలో అందించే పరిస్థితి ఉంటుందని అన్నారు. ప్రజలు దరఖాస్తు ఫారాలు తీసుకున్న తర్వాత సక్రమంగా నింపడానికి వారికి వ్యవధి కావాల్సి ఉంటుంది.




ఆ విధమైన వ్యవధి ఇవ్వాలంటే బి ఎల్ .ఓ.లు సరైన సమయంలో బి.ఎల్ .ఏ.లకు సహకరిస్తే ఖచ్చితమైన సమయంలో ప్రజలకు దరఖాస్తు ఫారాలు అందించే అవకాశంఉంటుందని అన్నారు. దరఖాస్తు ఫారాలు ప్రజలకు అందిస్తే వారు సరియైన వ్యవధిలో దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి తిరిగి బిఎల్ఓ లకు సమర్పించే అవకాశం ఉంటుందని అన్నారు.. బిఎల్ ఎ లు వివరించేది ఏమిటంటే పలువురు ప్రజలు అయోమయం ఆందోళనకు గురవుతున్నారని కొందరి పేర్లు ఓటరు జాబితాలో కనిపించకపోవడం మరికొందరికి జాబితాలో ఉన్న పేరు ఆధార్ కార్డులో ఉన్న పేరు వేర్వేరుగా ఉండడంతో దరఖాస్తులు ఎలా నింపాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆన్లైన్ లో ఫారాలు సమర్పించే రావడం వల్ల సాంకేతిక పరిజ్ఞానం లేని వారు మరింత బహిరంగ గురవుతున్నట్లు మా దృష్టికి వచ్చిందని తెలిపారు.ఏది ఏమైనా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కొన్ని డివిజన్లో సర్ కార్యక్రమం బిఎల్ఓల చేత సక్రమంగా నడుస్తున్నప్పటికీ కొన్ని డివిజన్లో పైన చెప్పిన పరిస్థితి ఉంది కాబట్టి ఇప్పటికైనా బిఎల్వోలు మేల్కొని మాకు సహకరించాలని కోరుతున్నారు బి ఎల్ ఎ లు.




# 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్‌లో సత్తా చాటిన సైబరాబాద్ పోలీసులు

### విజేతలను ఘనంగా సత్కరించిన సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్

**వాస్తవం : శేరిలింగంపల్లి జూలై 10 :**

మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జూలై 8, 9 తేదీల్లో నిర్వహించిన 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్--2026లో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన క్లస్టర్--ఏ క్రీడాకారులు విశేష ప్రతిభ కనబర్చి మొత్తం 37 పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని విజేతలను ఈ రోజు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయ ఆడిటోరియంలో పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్., ఘనంగా సత్కరించి నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేశారు.ఈ క్రీడా పోటీల్లో సైబరాబాద్ పోలీసులు 9 స్వర్ణ పతకాలు, 8 రజత పతకాలు, 20 కాంస్య పతకాలు సాధించి మొత్తం 37 పతక ఈవెంట్లలో విజయం నమోదు చేశారు. యోగా, ఆర్మ్ రెజ్లింగ్, వుషు, తైక్వాండో, బాక్సింగ్, కరాటే, జిమ్నాస్టిక్స్, పెన్‌చక్ సిలాట్, పవర్‌లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ తదితర వ్యక్తిగత, జట్టు విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు.ఈ సందర్భంగా సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ విధులు నిర్వహిస్తూనే పరిమిత సమయంలో సాధన చేసి ఇంతటి విజయాన్ని సాధించడం అభినందనీయమని అన్నారు. ఇదే క్రీడా స్ఫూర్తిని అన్ని క్రీడల్లోనూ కొనసాగించి సైబరాబాద్ పోలీసుల కీర్తి పతాకాన్ని మరింత ఎత్తుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు అవసరమైన శిక్షణ, క్రీడా సామగ్రి, ఇతర సౌకర్యాల కల్పనకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.పోలీస్ ఉద్యోగంలో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కూడా ఎంతో ముఖ్యమని, క్రీడలు ఒత్తిడిని తగ్గించి విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు తోడ్పడతాయని సీపీ తెలిపారు. ప్రతి పోలీసు ఉద్యోగి ఏదో ఒక క్రీడలో పాల్గొనాలని సూచించారు. ప్రస్తుతం పతకాలు సాధించిన క్రీడాకారులు మరెందరికో స్ఫూర్తిగా నిలిచి కొత్త ప్రతిభను వెలికితీయాలని అన్నారు. క్రీడలు వ్యక్తులనే కాదు, దేశాల మధ్య కూడా స్నేహం, ఐక్యత, పరస్పర అవగాహనను పెంపొందించే గొప్ప వేదిక అని పేర్కొన్నారు. పోలీసు శాఖలో కూడా క్రీడా స్ఫూర్తితో కలిసి పనిచేస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. తెలంగాణ పోలీస్ గేమ్స్ ఉ స్పోర్ట్స్ మీట్‌లో పతకాలు సాధించిన అధికారులు, సిబ్బందిని సైబరాబాద్ సీపీ అభినందించారు. వారి కృషి, క్రమశిక్షణ, అంకితభావం ఇతర పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొంటూ, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో సైబరాబాద్ పోలీసు క్రీడాకారులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.





# కదలని చెన్నూర్ మున్సిపల్ కమిషనర్

**వాస్తవం : చెన్నూర్ ఆర్సి**

మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ బదిలీ వ్యవహారం మరోసారి రాజకీయంగా చర్చనీయాంశమైంది. బదిలీ ఉత్తర్వులు వచ్చినప్పటికీ అమలు ఎందుకు కావడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కమిషనర్ బదిలీ విషయంలో కాంగ్రెస్ నాయకుల జోక్యం ఉందా? మంత్రి వివేక్ వెంకటస్వామి సిఫార్సులతోనే బదిలీ ప్రక్రియ నిలిచిపోయిందా? అంటూ ప్రతిపక్షాలు, స్థానికులు ప్రశ్నలు సంధిస్తున్నారు. చెన్నూరు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ గత ఆరు నెలల క్రితమే బదిలీ కావాల్సి ఉందని, అయితే మంత్రి సిఫార్సుతో ఆ బదిలీ నిలిచిపోయిందనే ఆరోపణలు అప్పట్లో వినిపించాయి. తాజాగా గత నెల జూన్ 27న మరోసారి బదిలీ ఉత్తర్వులు వచ్చినప్పటికీ ఇప్పటి వరకు రిలీవ్ కాకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణ ఉద్యోగుల బదిలీలు వెంటనే అమలవుతుంటే, ఒక మున్సిపల్ కమిషనర్ విషయంలో మాత్రం ఎందుకు జాప్యం జరుగుతోందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ ఆలస్యానికి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు లేదా పార్టీ నాయకుల ఒత్తిళ్లు కారణమా? మంత్రి స్థాయి నుంచి జోక్యం ఉందా? అనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. ఇప్పటికే కమిషనర్‌పై అధికార దుర్వినియోగం, వివాదాస్పద నిర్ణయాలపై పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, బదిలీ ఉత్తర్వులు అమలు కాకపోవడం పారదర్శక పాలనపై సందేహాలకు తావి స్తోందని విమర్శకులు అంటున్నారు. బదిలీ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం వెంటనే అమలు చేస్తుందా? లేక రాజకీయ



ఒత్తిళ్లతో మరింత ఆలస్యం జర గుతుందా? అన్నది ఇప్పుడు చెన్నూరులో హాట్ టాపిక్‌గా మారింది. అయితే బదిలీ జాప్యం, మంత్రి లేదా కాంగ్రెస్ నాయకుల ప్రమేయంపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు, మంత్రి లేదా కాంగ్రెస్ నాయకులు స్పందించాల్సి ఉంది.

### జర్మన్ భాష నేర్చుకుంటే
# రూ.25 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం

**మంత్రి వివేక్**



**వాస్తవం : చెన్నూర్ ఆర్ సి**

జర్మనీలో ఏడాదికి రూ.25 లక్షల ప్యాకేజీతో 5 లక్షల ఉద్యో గాలు ఖాళీగా ఉన్నాయని, యువత జర్మన్ భాష నేర్చుకుని వీటిని అందుకోవాలని మంత్రి వివేక్ తెలిపారు. ఈ అవకా శాన్ని అందిపుచ్చుకునేందుకు ప్రభుత్వం మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో వంద మందికి జర్మన్ భాషను నేర్పిస్తూ, నెలకు రూ. 2000 స్టైఫండ్ కూడా అందిస్తోందని తెలిపారు. యువత నైపుణ్యాలకోసం ప్రభుత్వం రూ.4500 కోట్లతో 120 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను (ఏటీసీ) ఏర్పాటు చేస్తోందన్నారు. టామ్ కామ్ (టీఓ ఎం సి ఓ ఎం.) ద్వారా వచ్చే ఈ విదేశీ ఉద్యోగాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# చెన్నూర్ విద్యాసంస్థల బంద్ విజయవంతం




**వాస్తవం : చెన్నూర్ ఆర్సి**

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాల కమిటీ పిలుపునిచ్చిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఉన్నత విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూతపడి బంద్‌కు మద్దతు తెలిపాయి. గత 6 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 10,500 కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్స్ నిధులను తక్షణమే విడుదల చేయాలని; 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు కుదించాలనే ఆలోచనను విరమించుకోవాలని; విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించాలని, ఉపాధ్యాయ, లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి. సికిందర్ పిడిఎస్ యు. జిల్లా ఉపాధ్యక్షుడు ,నాగరాజు ఎస్ ఎఫ్ ఐ. ఐ ఎఫ్ టి యు.డివిజన్ అధ్యక్షుడు,నాయకులు రమేష్ మాసాని, సధాకర్ రెడ్డి,తదితర పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# గుంతలమయంగా దూల్మిట్ట ప్రధాన రోడ్డు

**అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం**

**విద్యార్థులు,వృద్ధుల అవస్థలు మండల కేంద్రం ప్రజల తీవ్ర ఆగ్రహం**

**వాస్తవం : మద్దూరు**



చెప్పడానికి అది మండల కేంద్రం.. కానీ అక్కడ ప్రధాన రోడ్డు పరిస్థితి చూస్తే మాత్రం నరకప్రాయంగా మారింది. అధికారుల తీవ్ర నిర్లక్ష్యం కారణంగా దూల్మిట్ట మండల కేంద్రం ప్రధాన రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి, ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది. కొద్దిపాటి వర్షానికే రోడ్డంతా బురద కూపంగా తయారవుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ప్రమాదాల ముంగిట..? తాసిల్దార్ కార్యాలయం,స్థానిక బ్యాంకు, పాఠశాలలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి కావడం గమనార్హం. దీనివల్ల నిత్యం వందలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు,వృద్ధులు,మరియు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఈ రోడ్డుపైనే ప్రయాణించాల్సి వస్తోంది. రోడ్డుపై ఉన్న పెద్ద పెద్ద గుంతలు,బురద కారణంగా బైక్‌లు స్కిడ్ అవ్వడం,పాఠశాలలకు వెళ్లే చిన్న పిల్లలు నడవలేక కిందపడి గాయపడడం నిత్యకృత్యంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**ప్రజల ఆగ్రహం**

రోడ్డు అధ్వా న్న స్థితిపై స్థానిక అధికారులకు ఎన్నిసా ర్లు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయిందని ప్రజలు మండి పడుతున్నారు. మండల కేంద్రం అంటే అభివృద్ధికి ఆదర్శంగా ఉండాలి.కానీ ఇక్కడ రోడ్డు పరిస్థితి చూస్తే సిగ్గేస్తోంది.అధికారులు మా పిల్లల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు.అని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం మానేసి,తక్షణమే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. యుద్ధప్రాతిపదికన ఈ ప్రధాన రహదారికి మరమ్మతులు చేయించి,తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలని దూల్మిట్ట ప్రజలు కోరుతున్నారు.

### ఫారాలు నింపాలి..
# డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**వాస్తవం : వేములవాడ ఆర్‌సి**

ఎన్యూమరేషన్ ఫారాలు నింపాలి.. డిజిటలైజేషన్ పూర్తి చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐ ఆర్ )ప్రక్రియలో భాగంగా వేములవాడ పట్టణంలోని 25 వార్డు లోని 178 పోలింగ్ బూత్, 27 వార్డు 160 పోలింగ్ బూత్ లో ఎన్యూమరేషన్ ఫారాలు బూత్ లెవల్ అధికారి నింపుతుండగా, శుక్రవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ఆన్ లైన్ లో 2002 వివరాలు ఎలా తీసుకుంటున్నారు? యాప్‌లో వివరాలు ఎలా నమోదు చేస్తున్నారో ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ....ఎస్ ఐ ఆర్ లో భాగంగా ప్రతి బూత్ లెవల్ అధికారులు ప్రతి రోజూ 100 ఎన్యూమరేషన్ ఫారాలు నింపేలా లక్ష్యం నిర్ణయించుకొని ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో డీఆర్ఓ జయశ్రీ, ఆర్ డిఓ కె ఎస్ బి కుమారి, తహసీల్దార్ జయంత్, తదితరులు పాల్గొన్నారు.

# లద్నూరు ఆరోగ్య కేంద్రం పట్ల అధికారులు నిర్లక్ష్యం వీడాలి

**వాస్తవం : మద్దూరు**

మండలల పరిధిలోని లద్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలేటి యాదగిరి డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు ఆసుపత్రిని సందర్శించి, అక్కడ ఉన్న పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలేటి యాదగిరి మాట్లాడుతూ..ఆసుపత్రి ఆవరణ అంతా మురుగునీరు, పిచ్చిమొక్కలతో నిండిపోయి రోగాల నిలయంగా మారిందని మండిపడ్డారు. వైద్యం కోసం వచ్చే రోగులకు కనీసం తాగునీరు కూడా అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుల కొరత తీవ్రంగా ఉందని, దీనివల్ల అందుబాటులో ఉన్న ఒక్కరే 24 గంటల పాటు సేవలు అందించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.?అలాగే, నిరుపేద రోగులకు అత్యంత అవసరమైన బీపీ, షుగర్ మందుల కొరత తీవ్రంగా ఉందని ఆయన తెలిపారు. ప్రభుత్వం,ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి ఆసుపత్రిలో కింది సౌకర్యాలను వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి ఆవరణను శుభ్రం చేయించి,తాగునీటి వసతి కల్పించాలి. సిబ్బంది కొరతను తీర్చి,నిరంతర విద్యుత్ కోసం ఇన్వర్టర్ ఏర్పాటు చేయాలి. భద్రత కోసం సీసీ కెమెరాలు,అత్యవసర వైద్యం కోసం ఆపరేషన్ థియేటర్ నిర్మించాలి. ఆసుపత్రి సిబ్బంది కోసం క్వార్టర్స్ సదుపాయం కల్పించాలి. సమస్యలను తక్షణమే పరిష్కరించని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కా





ర్యక్రమంలో సిపిఎం నాయకులు ఎండి షఫీ, ఎల్లస్వామి, భాస్కర్, శ్రీను పాల్గొన్నారు.

# గ్రామ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయాలి

**ఆర్థిక సంఘం నిధులు, వీబీజీ రాంజీని సద్వినియోగం చేసుకోవాలి**

**సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రతి గ్రామ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని, దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై ఇల్లంతకుంట, గంబీరావుపేట, ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి, వీర్నపల్లి, ముస్తాబాద్ మండలాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పద్మనాయక కళ్యాణ మండపంలో శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీ గ్రామ జనాభా, అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికను రూపొందించుకోవాలని ఆదేశించారు. పాఠశాలలో కనీస వసతుల కల్పన, గ్రామంలో మురుగునీటి కాలువలు, ఇతర మౌలిక వసతులు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు నిబంధనల ప్రకారం వినియోగించాలని తెలిపారు. వీబీజీ రాంజీ కింద వివిధ పనులు చేసుకునే అవకాశం ఉందని, గ్రామీణ అభివృద్ధి శాఖ, ఎస్సీ కార్పొరేషన్ ఇతర ప్రభుత్వ శాఖలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల కింద గ్రామాభివృద్ధికి సంబంధించిన పథకాల వివరాలు తెలుసుకొని దానికి అనుగుణంగా తమ గ్రామంలో పనులు చేసుకోవాలని తెలిపారు. ఎల్ నినో నేపథ్యంలో వర్షపాతం తక్కువ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. దీనికి అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు సూచన మేరకు రైతులు పంటలు సాగు



చేసేలా సూచనలు చేయాలని పేర్కొన్నారు. స్వల్ప కాలిక పంటలు కూరగాయలు, పప్పు ధాన్యాలు,ఆయిల్ ఫామ్ సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. ఈ శిక్షణ తరగతులో జడ్పీ సీఈవో వెం కట మాధవరావు, డీఆర్ డీఓ లక్ష్మీ నారాయణ, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, మిషన్ భగీరథ ఈఈ అన్వర్, ఆయా మండలాల ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.

# పిహెచ్‌సీ ఇల్లంతకుంట నూతన భవన నిర్మాణ పనుల పరిశీలన

**వాస్తవం : ఇల్లంతకుంట**

ఇల్లంతకుంటమండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణ పనులను జిల్లా వైద్య అధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రిడ్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, భద్రతా ప్రమాణాలు పనులు పూర్తి చేసే గడువుపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌తో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం నిర్మిస్తున్న ఈ భవనాన్ని నిర్దేశిత గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి భవనం పూర్తయిన అనంతరం రోగులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణంలో వైద్య సేవలు అందేలా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని డీఎంహెచ్‌వో సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం



చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా. నాగేంద్ర బాబు, డా. రామకృష్ణ పాల్గొన్నారు.

# పదిలో నియోజకవర్గ టాపర్ రమ్యకు లక్ష నగదు ప్రోత్సాహకం

**పట్టుదలకు దక్కిన ప్రతిఫలం.ప్రముఖుల అభినందనలు**

**వాస్తవం : మద్దూరు**



శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా ఒక అద్భుతమైన నిర్ణయం తీసుకుంది. 2025-26 విద్యాసంవత్సరం పదో తరగతి ఫలితాల్లో జనగామ నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్న దూళ్మిట్ట ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని తుషాలపురం రమ్యకు లక్ష రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వారు ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ, నియోజకవర్గ స్థాయిలోనే టాప్‌గా నిలిచి ఈ భారీ నగదు బహుమతిని అందుకోనున్న తుషాలపురం రమ్యను ప్రధానోపాధ్యాయులు అనుముల కరుణాకర్ రెడ్డి,గ్రామ సర్పంచ్ లీలా జగ న్మోహన్ రెడ్డి, ఎపిపిసి చైర్మన్ నాచ గోని లక్ష్మి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**



**వాస్తవం : వేములవాడ ఆర్సీ**

వేములవాడ మండలం అనుపురం సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వేములవాడ లోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ పరామర్శించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితులను, వారికి అందిస్తున్న చికిత్స గురించి అదనపు కలెక్టర్ సంబంధిత వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యంతో పాటు మందులు, భోజనం క్రమం తప్పకుండా అందించాలని, వారి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యులు, సిబ్బందిని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిలా వైద్యాధికారి జి ఏంజాలే అల్ఫ్రెడ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పర్యవేక్షకులు ప్రవీణ్, తహసీల్దార్ జయంత్ పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం

**జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్**



**వాస్తవం : సిరిసిల్ల**

ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ విజయవంతం అయిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ... ప్రభుత్వం జూన్ 12 నాటికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ తదితర సౌకర్యాలను అందజేస్తామని ప్రకటించినప్పటికీ, పాఠశాలలు ప్రారంభమై 20 రోజులు గడిచినా ఇప్పటికీ విద్యార్థులకు యూనిఫాంలు పూర్తిస్థాయిలో అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పాఠ్యపుస్తకాలలో కూడా కొన్ని టైటిల్స్ అందుబాటులో లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో కూడా అనేక సమస్యలు కొనసాగుతున్నాయని, పెరిగిన ధరలకు అనుగుణంగా నిధులు పెంచకపోవడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం కష్టంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ముబారక్, మహేష్, నిఖిల్, అన్వేష్, రాహుల్, సాయి, శివ, వెన్నెల,అఖిల, స్నేహిత పాల్గొన్నారు.

JSS JOURNALISTS SANKSHEMA SANGAM
జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్టు సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్టు హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

విలేకర్లు కావలెను
సీనియర్ జర్నలిస్ట్ మానసాని కృష్ణారెడ్డి సంపాదకత్వంలో వెలువడుతున్న అశేష పాఠకాదరణ ఉన్న
వాస్తవం జనోదయ
తెలుగు దినపత్రికలకు
విలేకర్లు కావలెను.
9618616110, 8074124190

## ప్రతి నీటి బొట్టు ఒక నిధి

# రేపటి తెలంగాణకు జల భద్రతే పునాది



డా. సూర్యదేవర రామకృష్ణ
9490754169

తెలంగాణ సుదీర్ఘ చరిత్రాత్మక ప్రస్థానాన్ని నిశితంగా పరిశీలిస్తే, ఈ సాగునేల ఎల్లప్పుడూ జల సంరక్షణ కోసమే అలుపెరగని పోరాటం చేసినట్లు స్పష్టమవుతుంది. మధ్యయుగంలో కాకతీయుల స్వర్ణ యుగ పాలనలో వేలాది గొలుసుకట్టు చెరువులను నిర్మించి, ప్రతి వర్షపు చుక్కను ఒడిసిపట్టిన ఘనమైన వారసత్వం ఈ గడ్డది. అయితే, స్వాతంత్ర్యానంతర ఉమ్మడి పాలనలో దశాబ్దాల తరబడి జరిగిన తీవ్ర నిర్లక్ష్యం వల్ల ఈ ప్రాంత సాగునీటి రంగానికి తీరని అన్యాయం జరిగింది. స్వరాష్ట్ర సాధన కోసం ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమ జ్వాలలో నీళ్లు, నిధులు, నియామకాలు అనే త్రిసూత్ర నినాదం కేవలం రాజకీయ నినాదంగా మిగిలిపోలేదు. అది సకల తెలంగాణ జనావళి ఉనికికి, ఆత్మగౌరవానికి సంబంధించిన ఒక జీవన్మరణ సమస్య. స్వయంపాలన సిద్ధించి దశాబ్దం దాటినప్పటికీ, నేటికీ నీటి భద్రత అనేది తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి, భవిష్యత్ ప్రగతికి అత్యంత కీలకమైన మూలస్తంభంగా నిలుస్తోంది. రాష్ట్రంలోని వ్యవసాయ రంగా పునరుజ్జీవనం, పారిశ్రామికీకరణ, ప్రజా బాహుళ్య తాగునీటి అవసరాలు, మరియు పర్యావరణ సమతుల్యత వంటి ప్రతి రంగానికి జలవనరులే ప్రాణాధారం. అందువల్ల, నీటి భద్రతపై ప్రదర్శించే ఏ చిన్న ఉదాసీనత అయినా రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తును అంతిమంగా పెను ప్రమాదంలోకి నెట్టేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

**కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతంలో తీరని దాహార్తి**

తెలంగాణ భౌగోళిక సరిహద్దుల గుండా కృష్ణా, గోదావరి వంటి రెండు మహానదులు నిరంతరం ప్రవహిస్తున్నప్పటికీ, ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అహేతుక నీటి కేటాయింపుల వల్ల ఈ ప్రాంతానికి ఘోరమైన అన్యాయం జరిగిందనేది జగమెరిగిన చారిత్రక సత్యం. లోతట్టు ప్రాంతాలైన కోస్తా, రాయలసీమలకు నిరాటంకంగా నీరు తరలిపోగా, దక్కన్ పీఠభూమిపై ఎత్తైన భౌగోళిక అమరిక కలిగిన తెలంగాణ ప్రాంతం కేవలం వర్షాధారిత అస్థిర పంటలపైనే ఆధారపడాల్సి వచ్చింది. ఈ చారిత్రక సవాలును అధిగమించే లక్ష్యంతో, స్వరాష్ట్రంలో భారీ సాగునీటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం వంటి బృహత్తర ప్రాజెక్టుల ద్వారా గోదావరి జలాలను ఉత్తర తెలంగాణలోని ఎండిన బీళ్లకు మళ్లించే ముమ్మర ప్రయత్నాలు జరిగాయి. దీనిని ప్రపంచంలోనే అతిపెద్ద ఇంజినీరింగ్ అద్భుతంగా ప్రచారంలోకి తెచ్చినప్పటికీ, అపరిమిత రుణభారం, భారీ నిర్వహణ వ్యయం, మరియు ఇటీవలి కాలంలో వెలుగుచూసిన నిర్మాణ లోపాలు మేధావుల్లో తీవ్ర మేథోమథనానికి దారితీశాయి. ఈ చేదు అనుభవాలు నేర్పిన పరమార్థం ఒక్కటే: జల వనరుల ప్రాజెక్టులు కేవలం ఆడంబరమైన భారీతనంతో కాకుండా, ఆర్థిక స్థిరత్వం, పారదర్శకత, మరియు దీర్ఘకాలిక ప్రజా ప్రయోజనాలతో కూడిన శాస్త్రీయ దృక్పథంతో నిర్మించబడాలి.

**మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ : ఆశయాలు - క్షేత్రస్థాయి సవాళ్లు**

రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సురక్షితమైన కుళాయి నీటిని అందించాలనే సంకల్పంతో అట్టహాసంగా ప్రారంభమైన మిషన్ భగీరథ పథకం జాతీయ స్థాయిలో ఒక వినూత్న ప్రయోగంగా ప్రశంసలు అందుకుంది. మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు సైతం తాగునీటిని చేరవేయాలనే ఉన్నతమైన ఆశయం అభినందనీయమే అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో పైప్‌లైన్ల శాశ్వత నిర్వహణ, నిరంతర నీటి నాణ్యత పరీక్షలు, మరియు ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలలో దీర్ఘకాలిక వైద్య పర్యవేక్షణ వంటి అంశాలలో ఇంకా ఎంతో ప్రగతి సాధించాల్సి ఉంది. ఇదే క్రమంలో, కాకతీయుల జల విజ్ఞాన వారసత్వాన్ని పునరుద్ధరిస్తూ చేపట్టిన మిషన్ కాకతీయ ద్వారా వేలాది చెరువుల పూడికతీత పనులు జరిగాయి. ఇది కొంత వరకు భూగర్భజలాల పెంపుదలకు, స్థానిక పర్యావరణ పరిరక్షణకు చోదక శక్తిగా నిలిచింది. అయితే, ఈ పనులలో నాణ్యతా ప్రమాణాల లోపం, నిధుల కొరత, మరియు కొనసాగింపు లేకపోవడం వల్ల ఆశించిన దీర్ఘకాలిక ఫలితాలు పూర్తిస్థాయిలో లభించలేదనే విమర్శలు క్షేత్రస్థాయి నుండి బలంగా వినబడుతున్నాయి.

**భూగర్భజలం : నిశ్శబ్దంగా ముంచుకొస్తున్న సంక్షోభం**

ప్రస్తుత సాగునీటి రంగానికి సంబంధించి ఉపరితల నీటి ప్రాజెక్టులపై జరుగుతున్న సామాజిక, రాజకీయ చర్చలు భూగర్భజలాల పరిరక్షణపై జరగడం లేదు. వాస్తవానికి, ఇది రాష్ట్ర భవిష్యత్తును దెబ్బతీసే అత్యంత ప్రమాదకరమైన నిశ్శబ్ద సంక్షోభం. రాష్ట్రవ్యాప్తంగా అపరిమితంగా పెరుగుతున్న బోరుబావుల సంఖ్య కారణంగా భూగర్భజల మట్టాలు ఏటేటా పాతాళానికి పడిపోతున్నాయి. సాంప్రదాయేతర పంటల కంటే వరి సాగుకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం, మరియు వ్యవసాయానికి అందిస్తున్న ఉచిత విద్యుత్ వల్ల నీటి వినియోగంపై ఎలాంటి నియంత్రణ లేకపోవడం ఈ భూగర్భజల క్షీణతను మరింత వేగవంతం చేస్తున్నాయి. కరీంనగర్, నల్గొండ, మహబూబ్‌నగర్ వంటి ఉమ్మడి జిల్లాల పరిధిలోని పలు మండలాలు ఇప్పటికే కేంద్ర భూగర్భజల బోర్డు ద్వారా అతి దోపిడీ వర్గంలోకి చేర్చబడ్డాయి. ఈ ఆందోళనకరమైన ధోరణి ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో వ్యవసాయ రంగానికే కాకుండా తాగునీటి సరఫరాకు కూడా తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం పొంచి ఉంది.

**వ్యవసాయ విధానంలో సత్వర మార్పుల ఆవశ్యకత**

తెలంగాణ రైతాంగం సాంప్రదాయకంగా ఒకే రకమైన వరి పంటపైనే విపరీతంగా ఆధారపడటం వల్ల నీటి కొరత సమస్య జటిలమవుతోంది. వరి సాగుకు అవసరమయ్యే అపారమైన నీటిలో కొంత భాగాన్ని తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ ఆరుతడి పంటల (నూనెగింజలు, పప్పుధాన్యాలు) వైపు మళ్లించగలిగితే, నీటి భద్రతతో పాటు రైతుల ఆదాయ వనరులు కూడా స్థిరపడతాయి. దీనికోసం బిందు సేద్యం , మరియు తుంపర సేద్యం వంటి ఆధునిక సూక్ష్మ సేద్య పద్ధతులను రాయితీల ద్వారా విస్తృతంగా ప్రోత్సహించి నీటి వృథాను అరికట్టాలి.



అత్యంత పరిమితమైన జలవనరులతోనే అంతర్జాతీయ స్థాయిలో అద్భుతమైన వ్యవసాయ దిగుబడులు సాధిస్తున్న ఇజ్రాయెల్ వంటి దేశాల అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, నీటి యాజమాన్య పద్ధతులను తెలంగాణ వ్యవసాయ శాఖ లోతుగా అధ్యయనం చేసి, ఇక్కడి స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రయోగాత్మకంగా అమలు చేయాల్సిన అత్యవసర సమయం ఆసన్నమైంది.

**పట్టణ ప్రాంతాల జల సంక్షోభం : హైదరాబాద్ ముంగిట సవాళ్లు**

కేవలం గ్రామీణ ప్రాంతాలే కాకుండా, అంతర్జాతీయ నగరంగా వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరం సైతం రాబోయే రోజుల్లో తీవ్ర నీటి కొరతను ఎదుర్కోబోతోంది. ప్రస్తుతం కృష్ణా, గోదావరి జలాలను వందల కిలోమీటర్ల దూరం నుండి పైప్‌లైన్ల ద్వారా తరలించి నగరవాసుల దాహార్తిని తీరుస్తున్నప్పటికీ, శరవేగంగా పెరుగుతున్న జనాభా మరియు పట్టణీకరణ కారణంగా భవిష్యత్తులో నీటి డిమాండ్ ఊహించని స్థాయికి చేరనుంది. మరోవైపు మూసీ నది తీవ్ర కాలుష్య కాసారంగా మారడం, చారిత్రాత్మక చెరువులు మరియు జలవనరుల భూ ఆక్రమణలు, కాంక్రీట్ జంగిల్ కారణంగా వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశం లేకపోవడం వంటి అంతర్గత సమస్యలు నగర జల చక్రాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. ప్రతి బహుళ అంతస్తుల భవనంలో వర్షపు నీటి సంరక్షణ గుంతల నిర్మాణాన్ని చట్టబద్ధంగా తప్పనిసరి చేయడం, మరియు నగరంలో జనించే మురుగునీటిని అత్యాధునిక ప్లాంట్ల ద్వారా వంద శాతం శుద్ధి చేసి పారిశ్రామిక, ఉద్యానవన అవసరాలకు పునరుపయోగించడం వంటి పటిష్టమైన చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలి.

**వాతావరణ మార్పుల పెను సవాలు :**

ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న వాతావరణ మార్పుల ప్రతికూల ప్రభావం వల్ల వర్షపాత విధానం అత్యంత అనిశ్చితంగా మారుతోంది. కొన్ని సీజన్లలో అకస్మాత్తుగా కురిసే అతివృష్టి వల్ల వరదలు సంభవించి ప్రాజెక్టులు మునిగిపోతుండగా, మరికొన్ని సార్లు దీర్ఘకాలిక అనావృష్టి పరిస్థితులు తెలంగాణను వణికిస్తున్నాయి. ఈ అసాధారణ నేపథ్యంలో, నీటి నిర్వహణను కేవలం ఒక సివిల్ ఇంజినీరింగ్ లేదా నిర్మాణ సమస్యగా మాత్రమే చూడకూడదు. దానిని పర్యావరణ సమతుల్యత మరియు జీవవైవిధ్య పరిరక్షణతో ముడిపడిన ఒక సమగ్ర విధానంగా పరిగణించాలి. హరితహారం వంటి కార్యక్రమాల ద్వారా అడవుల విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచడం, నదీ పరీవాహక ప్రాంతాలలో మృత్తికా క్రమక్షయాన్ని నివారించడం, మరియు స్థానిక కొండ వాగులను పరిరక్షించడం ద్వారా మాత్రమే వాతావరణ మార్పుల సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోగలం.

**ముగింపు: సుస్థిర ప్రగతికి దిక్సూచి**

అంతర్ రాష్ట్ర నదీ జలాల కేటాయింపుల్లో శాస్త్రీయ ప్రణాళికలు, ప్రాజెక్టుల వ్యయ నియంత్రణలో పారదర్శకత, భూగర్భజలాల వినియోగంపై కఠినమైన చట్టపరమైన ఆంక్షలు, పంటల మార్పిడి విధానాన్ని అవలంబించే రైతులకు ప్రత్యేక ఆర్థిక ప్రోత్సాహకాలు, మరియు పట్టణ ప్రాంతాలలో పటిష్టమైన నీటి పొదుపు చర్యలు ఇవన్నీ సమపాళ్లలో మిళితమైనప్పుడే తెలంగాణకు శాశ్వత జల భద్రత లభిస్తుంది. నాటి తెలంగాణ సాయుధ మరియు రాజకీయ ఉద్యమ కాలంలో నీళ్లు అనే నినాదానికి ఉన్న సెంటిమెంట్ మరియు భావోద్వేగ విలువను, నేడు ఆధునిక పరిపాలనలో ఒక సుస్థిరమైన, ప్రాచ్యోన్ముఖ ఆచరణాత్మక జల విధానంగా మార్చుకోవాల్సిన చారిత్రక బాధ్యత నేటి తరంపై ఉంది. ప్రతి నీటి బొట్టును అమూల్యమైన సంపదగా భావించి సంరక్షించుకోగలిగితేనే, రాబోయే తరాలకు మనం సురక్షితమైన, సస్యశ్యామలమైన మరియు సుసంపన్నమైన తెలంగాణను కానుకగా అందించగలం. ఎందుకంటే, జల సంరక్షణే నిజమైన అర్థంలో తెలంగాణ భవిష్యత్ సర్వతోముఖాభివృద్ధికి ఏకైక దిక్సూచి.

**రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సురక్షితమైన కుళాయి నీటిని అందించాలనే సంకల్పంతో అట్టహాసంగా ప్రారంభమైన మిషన్ భగీరథ పథకం జాతీయ స్థాయిలో ఒక వినూత్న ప్రయోగంగా ప్రశంసలు అందుకుంది. మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు సైతం తాగునీటిని చేరవేయాలనే ఉన్నతమైన ఆశయం అభి నందనీయమే అయినప్పటికీ, క్షేత్రస్థా యిలో పైప్‌లైన్ల శాశ్వత నిర్వహణ, నిరంతర నీటి నాణ్యత పరీక్షలు, మరియు ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలలో దీర్ఘకాలిక వైద్య పర్యవేక్షణ వంటి అంశాలలో ఇంకా ఎంతో ప్రగతి సాధించాల్సి ఉంది. ఇదే క్రమంలో, కాకతీయుల జల విజ్ఞాన వా రసత్వాన్ని పునరుద్ధరిస్తూ చేపట్టిన మిషన్ కాకతీయ ద్వారా వేలాది చెరువుల పూ డికతీత పనులు జరిగాయి. ఇది కొంత వరకు భూగర్భజలాల పెంపుదలకు, స్థానిక పర్యావరణ పరిరక్షణకు చోదక శక్తిగా నిలిచింది. అయితే, ఈ పనులలో నాణ్యతా ప్రమాణాల లోపం, నిధుల కొర త, మరియు కొనసాగింపు లేకపోవడం వల్ల ఆశించిన దీర్ఘకాలిక ఫలితాలు పూర్తిస్థాయిలో లభించలేదనే విమర్శలు క్షేత్రస్థాయి నుండి బలంగా వినబడుతున్నాయి.**

# తయారీ రంగానికి తెలంగాణ అత్యంత అనుకూలం

### రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా జర్మన్ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి

### జర్మనీ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో భేటీలో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్:** తయారీ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అత్యంత అనుకూలమని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా జర్మనీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ఆ దేశ అత్యున్నత స్థాయి ప్రతినిధి బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. పెట్టుబడులకు అనుకూలమైన పారిశ్రామిక విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులతో ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. బవేరియన్(జర్మనీ) మినిస్ట్రీ ఆఫ్ ఎకానమిక్ అఫైర్స్, రీజినల్ డెవలప్‌మెంట్ అండ్ ఎనర్జీ వైస్ మినిస్టర్ టోబియాస్ గోత్‌హార్ట్ నేతృత్వంలోని జర్మనీ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం శుక్రవారం డా.బీఆర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ భేటీలో 'తెలంగాణ -- జర్మనీ' మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు గల అవకాశాలపై చర్చించారు. పారిశ్రామికాభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, పరిశ్రమలకు కల్పిస్తున్న ప్రోత్సాహకాలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, ఏరో స్పేస్, డిఫెన్స్, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ప్రెసిషన్ ఇంజినీరింగ్, డిజిటల్ ఇంజినీరింగ్, సెమీకండక్టర్లు, ఆటోమోటివ్ అండ్ మొబిలిటీ, ఏఐ, డిజిటల్ హెల్త్, రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్, క్లీన్ ఎనర్జీ, జీసీసీలు, ఇండస్ట్రీ 4.0 తదితర రంగాల్లో తెలంగాణలో విస్తృత పెట్టుబడి అవకాశాలు ఉన్నాయన్నారు. అత్యాధునిక సాంకేతికత, పరిశోధన, ఇన్నోవేషన్, స్కిల్లింగ్‌కు ప్రాధాన్యమిస్తూ... ఈ రంగాల్లో భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా సమగ్ర ఎకోసిస్టమ్‌ను రాష్ట్రంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు.



'తెలంగాణ--జర్మనీ' మధ్య భాగస్వామ్యాన్ని పెట్టుబడులకు మాత్రమే పరిమితం కాకుండా సాంకేతికత, పరి శోధన, నైపుణ్యాభివృద్ధి రంగాలకూ విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హోస్పర్, హైదరాబాద్‌లో జర్మనీ గౌరవ కాన్సుల్ అమితా దేశాయ్, బవేరియా ఆర్థిక శాఖ ఈడీ ఉల్రికే హోఫ్‌మన్, బవేరియా ఇండియా కార్యాలయ ఈడీ జాన్ కొట్టాయిల్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణలో మళ్లీ గెలిచేది కాంగ్రెస్సే

- భద్రాచల రాముడిపై ఆన.. ఇది కాంగ్రెస్ కార్యకర్తల ప్రతిన
- 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగవు
- తెలంగాణలో 2029 జూన్‌లోనే అసెంబ్లీ ఎన్నికలు
- పార్లమెంట్ సీట్లు 26, అసెంబ్లీవి 182కి పెరుగుతాయి
- 182లో 117 సీట్లు గెలిచి రెండోసారి ప్రజాపాలన వస్తుంది
- కల్వకుంట్ల కౌరవ కుటుంబాన్ని పాతాళానికి తొక్కుతాం
- పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌లో బంధించాం
- ఆ పాపాల భైరవుడికి ఇకపై విముక్తి లేదు
- రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి

**ఖమ్మం :** రైతు భరోసా తుది విడత నిధులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఖమ్మంలో జరిగిన రైతు ఆశీర్వాద సభలో పాల్గొన్న రేవంత్ రెడ్డి.. అన్నదాతల నిధులు విడుదల చేసేందుకు బటన్ నొక్కారు. అనంతరం భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణలో పదేళ్లపాటు బీఆర్ఎస్ రాక్షస పాలన సాగిందని సీఎం రేవంత్ అన్నారు. వారి పాలనలో రైతులకు బేడీలు వేశారని మండి పడ్డారు. దీంతో ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ అనేది లేకుండా ప్రజలు చేశారని ఆయన చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'ఖమ్మం జిల్లాలో 2023లో ఓ అద్భుతం జరిగింది. బీఆర్ఎస్‌ను కాదని కాంగ్రెస్‌లోకి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వచ్చారు. దీంతో ఆనాడు కాంగ్రెస్‌లోకి ఉప్పెనలా జనం వచ్చారు. కారు పార్టీని ప్రజలు ఇక్కడ మళ్లీ మొలకెత్తనీయకుండా చేశారు. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ డబ్బు మూటలను కాంగ్రెస్ తట్టుకోలేదని కొందరు అన్నారు. అయితే, 65 సీట్లలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని చెప్పి మరీ గెలిచి చూపించాం. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఆ పార్టీకి గుండు సున్నా వచ్చేలా చేశాం. 2023 ప్రభుత్వ ఏర్పాటు నుంచి ఏ ఎన్నికలైనా కాంగ్రెస్‌దే గెలుపు. 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగవు. తెలంగాణలో 2029 జూన్‌లోనే అసెంబ్లీ ఎన్నికలు వస్తాయి. 2029లో జరిగే కురుక్షేత్రంలో మళ్లీ గెలిచేది కాంగ్రెస్సే. పార్లమెంట్ సీట్లు 26, అసెంబ్లీవి 182కి పెరుగుతాయి. 182లో 117 సీట్లు గెలిచి రెండోసారి ప్రజాపాలన వస్తుంది. భద్రాచల రాముడిపై ఆన.. ఇది కాంగ్రెస్ కార్యకర్తల ప్రతిన. కల్వకుంట్ల కౌరవ కుటుంబాన్ని పాతాళానికి తొక్కుతాం. పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌లో బంధించాం. ఆ పాపాల భైరవుడికి ఇకపై విముక్తి లేదు. ఆనాడు వరి వేస్తే.. ఉరి వేసినట్లే అని కేసీఆర్ అన్నారు. కానీ మేం వ్యవసాయం దండగ కాదు.. పండుగ అన్నాం. పేదలకు సన్నబియ్యం, వడ్లకు బోనస్ అందిస్తున్నాం. అన్నదాతల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేశాం. ప్రతి సందర్భంలోనూ వారిని ఆదుకుంటూ వస్తున్నాం. రైతు కళ్లల్లో ఆనందమే మాకు ఆశీర్వాదం. కల్వకుంట్ల కుటుంబంలో ఒకరంటే ఒకరికి నమ్మకం లేదు. కుళ్లు, కుతంత్రాలు, కుట్రలతో బయటకు వస్తున్నారు. అధికారం పోయిందనే అక్కసుతోనే ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు. బావా బామ్మర్దులిద్దరూ ఊళ్లపై పడి తెగ తిరుగుతున్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని విషప్రచారం చేశారు. ఇప్పుడు కరెంట్ తీగలు పట్టుకోండి.. సలసల మాడిపోతారు. ఉచిత కరెంట్ కాంగ్రెస్ పేటెంట్. ఆనాడు డబుల్ బెడ్‌రూమ్‌ల పేరుతో సినిమా కథలు చెప్పారు. ఇప్పుడు పొంగులేటి 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తున్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లు ఓపెన్ చేయాలని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. కన్నెపల్లి పంప్‌లు ఆన్ చేస్తే భద్రాచల రాముడి ఆలయం సహా 44 గ్రామాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. కేసీఆర్ ఇంట్లో ఒకరంటే ఒకరికి పడదు. బీజేపీతో హరీశ్ రావు మంతనాలు జరుపుతున్నారో, లేదో భద్రాచల రాముడిపై ఒట్టేసి చెప్పాలి. కారు పార్టీలో ఉంటావో లేదో కేసీఆర్‌పై ఒట్టేసి హరీశ్ రావు చెప్పాలి. తాటిచెట్టంత పెరిగినా ఆయనకు బుర్రలో గుజ్జు లేదు. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తారని కేటీఆర్ చెల్లెలే చెబుతున్నారు' అని తెలిపారు.







# పిల్లల సంరక్షణ కోసం 'హెబియస్ కార్పస్' కుదరదు

### అమ్మమ్మ వద్ద ఉండటం చట్టవిరుద్ధమైన నిర్బంధం కాదు : సుప్రీం

**న్యూఢిల్లీ, జూలై 10 :** మైనర్ల సంరక్షణపై వివాదాల్లో హెబియస్ కార్పస్ పిటిషన్లు వర్తించవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. చట్టవిరుద్ధంగా ఎవరినైనా నిర్బంధించినప్పుడు మాత్రమే ఈ పిటిషన్ దాఖలు చేయాలని, పిల్లల సంరక్షణ కోరే విషయంలో గార్డియన్స్ అండ్ వార్డ్స్ కోర్టును ఆశ్రయించడమే చట్టపరంగా సరైన మార్గమని తేల్చిచెప్పింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పీవీఎస్ ఎల్ఎన్ ఆచార్యులు, ఆయన భార్య మధ్య కొంతకాలంగా వివాదాలు నడుస్తున్నాయి. వీరికి ఐదేళ్లు, రెండేళ్ల వయసున్న ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లల తల్లిపై ఎన్డీపీఎస్ యాక్టు కింద కేసు నమోదవడం, ఆమె మానసిక ఆసుపత్రిలో చేరడం వంటి పరిణామాల నేపథ్యంలో పిల్లలు ప్రస్తుతం అమ్మమ్మ సంరక్షణలో ఉన్నారు. అయితే వారిని చట్టవిరుద్ధంగా నిర్బంధించారని ఆరోపిస్తూ ఆచార్యులు హెబియస్ కార్పస్ వేశారు. అది చట్టవిరుద్ధమైన నిర్బంధం కిందకు రాదని, పిల్లల సంరక్షణ కోసం సంబంధిత గార్డియన్స్ అండ్ వార్డ్స్ కోర్టును ఆశ్రయించాలని సూచిస్తూ హైకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. తీర్పును ఆచార్యులు ఈనెల 2న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్ శుక్రవారం జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ శ్రీ చంద్రశేఖర్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పిల్లలు అమ్మమ్మ వద్ద ఉండటం ఏమాత్రం చట్టవిరుద్ధమైన నిర్బంధం కిందకు రాదని ధర్మాసనం స్పష్టం చేసింది. తండ్రి సంరక్షణలో పిల్లలు ఉన్నప్పుడు వారిని ఎవరైనా చట్టవిరుద్ధంగా బలవంతంగా తీసుకెళ్లి ఉంటే హెబియస్ కార్పస్ పిటిషన్ వేయవచ్చని పేర్కొంది. ఇలాంటి పిటిషన్లలో జోక్యం చేసుకోలేమని, పిల్లల సంక్షేమం, భద్రతను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవాల్సింది గార్డియన్స్ అండ్ వార్డ్స్ కోర్టు మాత్రమేనని తేల్చి చెప్పింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి తగిన కారణాలు లేవంటూ, ఆర్టికల్ 136 కింద దాఖలైన ఎస్ఎల్‌పీని కొట్టివేసింది.



**మైనర్ల సంరక్షణపై వివాదాల్లో హెబియస్ కార్పస్ పిటిషన్లు వర్తించవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. చట్టవిరుద్ధంగా ఎవరినైనా నిర్బంధించినప్పుడు మాత్రమే ఈ పిటిషన్ దాఖలు చేయాలని, పిల్లల సంరక్షణ కోరే విషయంలో గార్డియన్స్ అండ్ వార్డ్స్ కోర్టును ఆశ్రయించడమే చట్టపరంగా సరైన మార్గమని తేల్చిచెప్పింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పీవీఎస్ ఎల్ఎన్ ఆచార్యులు, ఆయన భార్య మధ్య కొంతకాలంగా వివాదాలు నడుస్తున్నాయి. వీరికి ఐదేళ్లు, రెండేళ్ల వయసున్న ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లల తల్లిపై ఎన్డీపీఎస్ యాక్టు కింద కేసు నమోదవడం, ఆమె మానసిక ఆసుపత్రిలో చేరడం వంటి పరిణామాల నేపథ్యంలో పిల్లలు ప్రస్తుతం అమ్మమ్మ సంరక్షణలో ఉన్నారు. అయితే వారిని చట్టవిరుద్ధంగా నిర్బంధించారని ఆరోపిస్తూ ఆచార్యులు హెబియస్ కార్పస్ వేశారు. అది చట్టవిరుద్ధమైన నిర్బం ధం కిందకు రాదని, పిల్లల సంరక్షణ కోసం సంబంధిత గార్డియన్స్ అండ్ వార్డ్స్ కోర్టును ఆశ్రయించాలని సూ చిస్తూ హైకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసింది.**

## నర్సరీ టెండర్లను వెంటనే పిలవాలి



**వాస్తవం, గోదావరిఖని, జులై 10.**

రామగుండం వన్ డివిజన్‌లో నర్సరీ టెండర్లను వెంటనే పిలవాలని కార్మికులకు పూర్తి స్థాయిలో పనులు కల్పించాలని ఈరోజు సింగరేణి నర్సరీ ముందు కార్మికుల ఆధ్వర్యంలో నిరసన ధర్నా కార్యక్రమం చేయడం జరిగింది. ఈ నిరసన ధర్నా కార్యక్రమానికి కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు శనిగల శ్రీనివాస్, మద్దెల శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ నర్సరీ టెండర్‌లు వచ్చేదాకా కార్మికులను కంటినేషన్ టెండర్ ప్రకారం చేపిచ్చే పద్ధతి సింగరేణిలో ఉన్నది, సివిల్ లేదా ×జుణ మాస్టర్స్ తో లేదా బేసిక్‌లో ప్రత్యేక టెండర్ పిలిచి ఈ కార్మికులకు పూర్తిస్థాయిలో ఉపాధిని కల్పించాలని కోరుతూ నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఆర్జీవన్ పరిధిలోని మహిళ నర్సరీ కార్మికులు గత ఏప్రిల్ నుండి ఎలాంటి పనులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని సింగరేణి యాజమాన్యం అధికారుల మధ్య సమన్వయం లోపం లేక టెండర్లు పిలవడంలో జాప్యం చేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేయడం జరుగుతుంది. కావున ఈ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టి టెండర్లను వెంటనే పిలవాలని, వారి యొక్క స్వార్థం కోసం టెండర్లు రాకుండా ఇబ్బంది చేస్తున్నా కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని, వెంటనే నర్సరీ కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు లేని యెడల సింగరేణి వ్యాప్తంగా అన్ని డివిజన్ ఏరి యాల జిఎం ఆఫీస్‌ల ముందు కార్మికులతో పెద్ద ఎత్తున ఆందోళన దీక్ష కార్యక్ర మాలు, చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నర్సరీ కార్మికులు నరహరి పద్మ, చెర్ల రాజేశ్వరి, మాదాసి వనమాల, మాదాసి లక్ష్మి, పోగుల లక్ష్మి, అన పురం శారద, ఈశ్వరి, మినుము సుజాత, గాధం లక్ష్మి, కన్నూరు రాజేశ్వరి, ఆడెపు లక్ష్మి, రాజమణి, ఓదమ్మ, భాగ్య

Publisher, Editor and Owned by Manasani Krishna Reddy, H No 4-81/1, Ramagundam, Elkalpalli, Karimnagar, Telangana - 505208. Cell No - 8074124190